నమస్తే తెలంగాణ
మెదక్
I | హైదరాబాద్, ఆదివారం 12 మే 2024 | MEDAK

కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పేందుకు
ప్రజలు సిద్ధం

ఆరు గ్యారెంటీలపై గరంగరంగా ప్రజలు



సిద్దిపేటలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

- తెలంగాణపై బీజేపీది సవతితల్లి ప్రేమ..
- ఉద్యమాన్ని గుర్తు చేసిన కేసీఆర్ రోడ్ షోలు
- పార్లమెంట్‌లో తెలంగాణ గొంతుక బీఆర్ఎస్
- రైతుల గౌరవం పెంచిన కేసీఆర్
- పదేండ్ల బీఆర్ఎస్ హయాంలో 50 ఏండ్ల అభివృద్ధి
- ఐదు నెలల కాంగ్రెస్ పాలనలో ఐదేండ్లు వెనక్కి..
- సిద్దిపేటలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట అర్బన్, మే 11: కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల వైఫల్యంపై ప్రజలు గరంగరంగా ఉన్నారు. వారు చేసిన మోసాలపై ప్రతీకారం తీర్చుకునేందుకు ఈ ఎన్నికలు అవకాశం కల్పించాయని, ఎన్నికల్లో రైతులు, మహిళలు, వృద్ధులు తమ ఆగ్రహాన్ని ఓట్ల రూపంలో చూపించబోతున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. శనివారం సిద్దిపేటలోని తన నివాసంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. రెండు నెలల నుంచి బీఆర్ఎస్ కార్యకర్తలు ఎంతో కష్టపడ్డారని, కేసీఆర్ నిర్వహించిన రోడ్ షోలు ఉద్యమం నాటి రోజులను గుర్తు చేశాయన్నారు. ప్రజలు కేసీఆర్ సభకు ఎండలను సైతం లెక్కచేయకుండా నీరాజనం పట్టారన్నారు. కేసీఆర్ సభలకు ప్రజల నుంచి ముఖ్యంగా మహిళలు, యువత నుంచి అనూహ్య స్పందన వచ్చిందన్నారు. కాంగ్రెస్, బీజేపీ సభలు జనంలేక వెలవెలబోయాయన్నారు. సిద్దిపేటలో జరిగిన అమిత్ షా సమావేశంలో జనం లేక కేవలం 7 నిమిషాల్లోనే మాట్లాడి ముగించారన్నారు. రాహుల్ గాంధీ సరూర్‌నగర్ మీటింగ్‌లో జనంలేక స్వయంగా రేవంత్‌రెడ్డే వెళ్లి ఆహ్వానించే పరిస్థితి ఏర్పడిందన్నారు. మూడు పార్లమెంట్ల సమావేశాలు ఏర్పాటు చేస్తే రాహుల్‌గాంధీ మూడు నిమిషాల్లోనే ముగించుకొని పోయిన పరిస్థితి ఉందన్నారు. పటాన్‌చెరులో కేసీఆర్ సభ పెడితే ఇసుకేస్తే రాలనంత జనం వచ్చారు. అదే స్థలంలో రేవంత్‌రెడ్డి సభ పెడితే 25శాతం మంది కూడా రాక గ్రౌండ్ అంతా ఖాళీగా ఉన్నదన్నారు.

ఓటుతో గుణపాఠం చెప్పాలి..

చెక్ బౌన్స్ అయితే శిక్ష పడ్డట్టు..బౌండ్ పేపర్ బౌన్స్ కావడంతో శిక్ష వేయాలని ప్రజలు భావిస్తున్నారని చెప్పారు. కేసీఆర్ తమ గురించి బలంగా కొట్లాడాలంటే కారుగుర్తుకు ఓటు వేయాలని ప్రజలు నిర్ణయించుకున్నట్లు తెలిపారు. బీజేపీ, కాంగ్రెస్ నాయకుల ఊకదంపుడు ఉపన్యాసాలు ప్రజలు రుచించడం లేదన్నారు. తెలంగాణ వాణి, తెలంగాణ బాణి పార్లమెంట్‌లో వినిపించాలంటే బీఆర్ఎస్ అభ్యర్థులు గెలవాలనే భావన వినిపిస్తుందన్నారు. తెలంగాణకు ఏమీ ఇవ్వని బీజేపీకి ఓటు ఎందుకు వేయాలని ప్రజలు భావిస్తున్నారని.. మిషన్ భగీరథకు, మెడికల్ కళాశాల మంజూరు చేయడంలో, సాగు నీటి ప్రాజెక్ట్‌ల్లో, మిషన్ కాకతీయకు నిధులు అందజేయడంలో బీజేపీ సవతితల్లి ప్రేమ చూపిందన్నారు. కేసీఆర్ హయాంలో పుట్ల కొద్దీ ధాన్యం పండితే.. కాంగ్రెస్ హయాంలో పుట్టెడు కష్టాలు వచ్చాయన్నారు. అరచేతిలో వైకుంఠం చూపిన కాంగ్రెస్సోళ్లకు ఓటుతో గుణపాఠం చెప్పేందుకు ప్రజలంతా సిద్ధమైనట్లు హరీశ్‌రావు తెలిపారు.

బీఆర్ఎస్‌కు పూర్వ వైభవం..

కాంగ్రెస్, బీజేపీలు బోగస్ సర్వేలతో బీఆర్ఎస్‌ను దెబ్బతీసేందుకు విశ్వప్రయత్నాలు చేశారు. కానీ ప్రజల ఆదరణను ఆపలేక పోయారన్నారు. ప్రజలు కేసీఆర్‌కు అపూర్వ రీతిలో స్వాగతం పలికారని చెప్పారు. ఈ రెండు పార్టీలకు ప్రజలు బుద్ధి చెప్పాలని నిర్ణయించుకున్నట్లు హరీశ్‌రావు తెలిపారు. ఇతర పార్టీల అభ్యర్థులు ప్రలోభాలకు గురిచేసే అవకాశం ఉన్నందున బీఆర్ఎస్ కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలన్నారు. బీఆర్ఎస్‌కు పూర్వ వైభవం రాబోతుందని.. తెలంగాణ ప్రజలకు కచ్చితమైన గ్యారెంటీ బీఆర్ఎస్ మాత్రమేనని.. కేసీఆర్ గ్యారెంటీ తెలంగాణ ప్రజలకు శ్రీరామరక్ష అన్నారు.

కాంగ్రెస్‌తో అన్ని వర్గాలకూ అన్యాయం..

రిజర్వేషన్లపై మాట్లాడే రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ టికెట్లలో, క్యాబినేట్ కూర్పులో ఏ రిజర్వేషన్లు అమలు చేశారో చెప్పాలన్నారు. రిజర్వేషన్ల గురించి మాట్లాడే హక్కు కాంగ్రెస్‌కు లేదన్నారు. మూడు ఎస్సీ రిజర్వ్‌డు టికెట్లలో ఒక్కరికి కూడా టికెట్ ఇవ్వలేదని.. వారికి తీరని అన్యాయం చేసిన కాంగ్రెస్‌కు మాదిగలు బుద్ధి చెప్పేందుకు సిద్ధమయ్యారన్నారు. ప్రధానమైన సామాజిక వర్గాలకు బీఆర్ఎస్ టికెట్ ఇచ్చిందని.. బీసీలకు అత్యధిక టికెట్లు ఇచ్చిన పార్టీ బీఆర్ఎస్ అన్నారు.వెంకట్రామిరెడ్డి ఎమ్మెల్సీగా ఉండగా.. ఎంపీ టికెట్ ఎందుకు ఇచ్చారని అడుగుతున్నారని, మరీ జగిత్యాలలో ఓడిపోయిన ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి నిజామాబాద్‌లో ఎందుకు టికెట్ ఇచ్చారని హరీశ్‌రావు ప్రశ్నించారు. ఎమ్మెల్యేగా ఉన్న దానం నాగేందర్‌కు టికెట్ ఇస్తే ఒప్పు.. ఎమ్మెల్సీగా ఉన్న వ్యక్తికి టికెట్ ఇస్తే తప్పా అన్నారు. పూటకో మాట మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి విశ్వసనీయత కోల్పోయారన్నారు.

ఫేక్ ప్రచారాలను ప్రజలు నమ్మవద్దు..

మెదక్‌లో బీజేపీ అభ్యర్థి జిమ్మిక్కులు చేస్తాడని, గత దుబ్బాక ఉప ఎన్నికల్లో ఓటింగ్ ప్రారంభమయ్యే ముందు ఫేక్ వీడియోలు సృష్టించి ప్రజల్లో గందరగోళం సష్టించారని హరీస్‌రావు అన్నారు. ఇప్పటికే అలాంటి వీడియోలు తయారు చేశారని, తమకు సమాచారం ఉందన్నారు. బీజేపీ, కాంగ్రెసోళ్ల సోషల్ మీడియాలో పంపించే ఫేక్ వీడియోలను ప్రజలు గుడ్డిగా నమ్మవద్దని.. ఒకటికి రెండుసార్లు చెక్ చేసుకోవాలన్నారు. వెంకట్రామ్‌రెడ్డి విద్యావంతుడు. 22 ఏండ్ల నుంచి ఈ జిల్లాతో అనుబంధం, అవగాహన ఉన్నదన్నారు. గెలిచిన తర్వాత ట్రస్ట్ సేవలు కచ్చితంగా కొనసాగిస్తానని కుటుంబంపై ప్రమాణం చేశాడన్నారు. వెంకట్రామిరెడ్డిని ఆశీర్వదిస్తే.. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను, సిద్దిపేటలో తనను ఆశీర్వదించినట్టే అన్నారు. ప్రతిఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. మాజీ కార్పొరేషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, వేణుగోపాల్‌రెడ్డి, భూపేశ్, నాయకులు ఉన్నారు.

ఐదు నెలల కాంగ్రెస్ పాలనలో ఐదేండ్లు వెనక్కి..

మోదీ మాటల్లో నీతి, రేవంత్‌రెడ్డి ప్రవర్తనలో రీతి లేదన్నారు. రేవంత్‌రెడ్డి ఎప్పుడైనా జై తెలంగాణ అన్నారా అని ప్రశ్నించారు. అమరవీరుల స్తూపం వద్ద ఏనాడూ రెండు పువ్వులు కూడా పెట్టలేదన్నారు. జిల్లాలు రద్దు చేస్తానని. చార్మినార్, కాకతీయ తోరణం చిహ్నం నుంచి తొలిగిస్తామని మాట్లాడడం విడ్డూరమన్నారు. ప్రపంచంలో ఎక్కడాలేని విధంగా 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం పెడితే కనీసం అంబేద్కర్ జయంతి రోజు ఒక పూలదండ వేయకుండా అవమానపర్చారన్నారు. చంద్రబాబు నాయుడు తెలంగాణలో ఎకరం అమ్మితే.. ఆంధ్రప్రదేశ్‌లో పది ఎకరాలు కొనవచ్చని చెప్పాడని, కానీ కాంగ్రెస్ పాలనలో పాలన రివర్సై భూముల ధరలు పడిపోయాయన్నారు. పదేండ్లలో కేసీఆర్ 50 ఏండ్ల అభివృద్ధి చూపిస్తే.. 5 నెలల్లోనే కాంగ్రెస్ 5 ఏండ్ల వెనక్కి తీసుకుపోయిందన్నారు. ఈ రాష్ట్రం అభివృద్ధి జరగాలంటే.. ఈ ప్రభుత్వానికి కనువిప్పు కలగాలంటే.. పార్లమెంట్‌లో తెలంగాణ గొంతు వినబడాలంటే బీఆర్ఎస్‌ను గెలిపించాలని ప్రజలు నిర్ణయించుకున్నట్లు తెలిపారు.

గజ్వేల్ హరీశ్‌రావు రోడ్‌షోకు హాజరైన ప్రజలు

గజ్వేల్ నవ నిర్మాత కేసీఆర్

కేసీఆర్ రాకముందు ఎట్లుండే... కేసీఆర్ వచ్చినంక ఎట్లయింది

- గజ్వేల్ గౌరవం, ప్రతిష్టను పెంచింది కేసీఆరే...
- గజ్వేల్ రూపురేఖలు మార్చి అభివృద్ధిలో అగ్రభాగాన నిలిపిన కేసీఆర్
- వెంకట్రామిరెడ్డి ట్రస్టు ద్వారా మీ అందరికీ ప్రయోజనం
- వెంకట్రామిరెడ్డిని భారీమెజార్టీతో గెలిపించాలి
- గజ్వేల్ రోడ్‌షోలో మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు
- తరలివచ్చిన గులాబీ శ్రేణులు, ప్రజలు



శనివారం గజ్వేల్ రోడ్‌షోలో మాట్లాడుతున్న హరీశ్‌రావు, చిత్రంలో బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి, యాదవరెడ్డి, వంటేరు ప్రతాప్‌రెడ్డి, స్వాగతం పలుకుతున్న మహిళలు

గజ్వేల్, మే 11: కేసీఆర్ రాకముందు గజ్వేల్ ఎట్లుండే...కేసీఆర్ వచ్చినంక ఇప్పుడెట్లుందో ప్రజలు ఆలోచన చేయాలే... గజ్వేల్ రూపురేఖలు మార్చిన కేసీఆర్‌ను గుండెల్లో పెట్టుకొని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. శనివారం సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా నిర్వహించిన రోడ్ షోలో ప్రజల నుద్దేశించి మాట్లాడుతూ..మాయమాటలు చెబుతూ కాంగ్రెస్ దేవుడి మీద ఒట్టు పెడితే...బీజేపీ మన నెత్తి మీద చేయి పెడుతుందన్నారు. ఇచ్చిన హామీలన్నీ అమలుచేస్తానని కుటుంబం మీద ఒట్టుపెట్టి ప్రజలకు మాట ఇచ్చిన వెంకట్రామిరెడ్డికే మద్దతు తెలుపాలని హరీశ్‌రావు పిలుపునిచ్చారు. గెలువగానే పిల్లలకు ఉద్యోగాలు వచ్చేలా శిక్షణ ఇప్పిస్తానని, పేద విద్యార్థుల చదువుకు సాయం చేస్తానని, రూపాయికే ఫంక్షన్ హాల్, రూ.10లక్షల బీమా చేస్తానని మీ ముందుకొచ్చిన వెంకట్రామిరెడ్డిని ఆశీర్వదించాలన్నారు. కాంగ్రెస్, బీజేపీ నాయకుల మాయమాటలు నమ్మొద్దన్నారు. తెలంగాణ ప్రదాతేకాదు... గజ్వేల్ నవ నిర్మాత కేసీఆర్ అని పేర్కొన్నారు. అప్పుడు గజ్వేల్‌లో చేసిన అభివృద్ధిని చూసి కేసీఆర్‌ను తిట్టిపోసిన ప్రతిపక్షాలు నేడు సిగ్గులేకుండా ఏ మొఖం పెట్టుకొని ఓట్లు అడగడానికొచ్చారో సమాధానం చెప్పాలన్నారు. ఈరోజు పోటీ ఎవరి మధ్య అంటే గజ్వేల్ అభివృద్ధిని అడ్డుకున్నవాళ్లకు, గజ్వేల్ అభివృద్ధికి మోకాలు అడ్డం పెట్టినోళ్లకు, అభివృద్ధిలో గజ్వేల్‌ను దేశంలోనే అగ్రగామిగా నిలిపిన మన కేసీఆర్‌కు మధ్య పోటీ అన్నారు. దుబ్బాకలో ఎమ్మెల్యేగా గెలిచి రూపాయి పని చేయకపోతే దౌల్తాబాద్, రాయపోల్ అక్కాచెల్లెళ్లు 54వేల ఓట్లతో బండకెసి కొట్టారని, ఇప్పుడు దుబ్బాకలో చెల్లని రూపాయి గజ్వేల్‌లో చెల్లుతాద అన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ రూ.4వేల పింఛన్ ఇస్తానని మోసం చేసిందన్నారు. 5నెలలు గడిచినా పింఛన్ పెంచలేదని, ప్రతి అవ్వతాతకు రూ.10వేలు బకాయి పడ్డారన్నారు. వంద రోజుల్లో మనకు గాడిద గుడ్డు తప్పా ఏమీ ఇయ్యలేదన్నారు. మహిళలకు రూ. 2500 ఇస్తామని మోసం చేశారన్నారు. రూ. 2500 పడ్డ వాళ్లందరూ కాంగ్రెస్‌కు ఓటు వేయాలని.. పడని వాళ్లంతా కారు గుర్తుకు ఓటు వేయాలన్నారు.

రివర్స్ గేర్‌లో కాంగ్రెస్ పాలన

రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన రివర్స్ గేర్‌లో నడుస్తోంది. కాంగ్రెస్ వచ్చినంక కేసీఆర్ కిట్, గజ్వేల్‌లో రూ.150కోట్ల పనులను రద్దు చేశారని ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. నిన్నటివరకు కేసీఆర్ పక్కనే ఉన్న లీడర్లు పార్టీలు మారారు. ఎక్కడ ప్రభుత్వం ఉంటదో అక్కడికి పోయారా ఇచ్చిన హామీలు అమలు చేయనందుకు పోయారా మీరే ఆలోచన చేయాలన్నారు. ఎప్పటికైనా మనందరికీ శ్రీరామరక్ష కేసీఆర్, మనకు అన్నం పెట్టిన కేసీఆర్‌ను కాపాడుకోవాలన్నారు. ముస్లింల కోసం మసీద్ వద్ద షాపింగ్ కాంప్లెక్స్, షాదీఖాన నిర్మించారని, క్రిస్టియన్ల కోసం క్రిస్టియన్ భవనాన్ని నిర్మించారన్నారు. ప్రజలకు సేవ చేసేందుకు ముందుకొచ్చిన వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు. ఆగంకాకుండా మొదటి ఈవీఎంలోనే వెంకట్రామిరెడ్డి, కారు బొమ్మ చూసి ఓటు వేయాలన్నారు. అందరం బాధ్యత తీసుకొని వెంకట్రామిరెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయిస్తామన్నారు. ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో మిగిలిన పనులను పూర్తి చేసేందుకు తామంతా సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. కలెక్టర్‌గా ఉన్న సమయంలో వెంకట్రామిరెడ్డికి కాలనీపై అవగాహన ఉందని, మేమంతా మీ వెంటే ఉండి సహకారం అందిస్తామని హరీశ్‌రావు తెలిపారు.

గజ్వేల్‌లో జన జాతర

గజ్వేల్‌లో బీఆర్ఎస్ చేపట్టిన రోడ్ షోకు అపూర్వ స్పందన లభించింది. గజ్వేల్ మండల పరిధిలోని గ్రామ పంచాయతీలు, ఆర్‌అండ్‌ఆర్ కాలనీలోని ఆయా గ్రామాలు, మున్సిపల్ పరిధిలోని వార్డుల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఎండను సైతం లెక్కచేయకుండా ప్రజలు హరీశ్‌రావు ప్రసంగాన్ని విన్నారు. ఆరు గ్యారెంటీల కాంగ్రెస్ కోడిగుడ్డు రోడ్ షోలో ఆకర్షణగా నిలిచింది. ఇందిరాపార్కు చౌరస్తాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రోడ్డుకు ఇరువైపులా ప్రజలు నిలబడి ప్రసంగం విన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, మాజీ కార్పొరేషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, మాజీ ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, వైస్ చైర్మన్ జకియొద్దీన్, జడ్పీటీసీ మల్లేశం, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశం గౌడ్, వైస్ ఎంపీపీ కృష్ణగౌడ్, పట్టణ అధ్యక్షుడు నవాజ్, రవీందర్‌రావు, చంద్రమోహన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, ఆకుల దేవేందర్, యాదగిరి, యుసూఫ్, విరాసత్ అలీ, హైదర్‌పటేల్, ఇస్మాయిల్, రమేశ్ గౌడ్, అక్కారం బాలచంద్రం నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారానికి తెర

- ఎన్నికల వ్యూహానికి పదునుపెట్టిన పార్టీలు
- ఓటర్లను ఆకట్టుకునేలా బీఆర్ఎస్ ప్రచారం

ఎండలను లెక్కచేయకుండా అభ్యర్థుల ప్రచారం



శనివారం శివ్వంపేట మండలం తార్యా తండాలో ప్రచారం చేస్తున్న నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి

సంగారెడ్డి, మే 11(నమస్తే తెలంగాణ): పార్లమెంట్ ఎన్నికల ప్రచారానికి శనివారంతో తెరపడింది. ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందు నుంచే ప్రధాన రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రచారానికి తెరలేపాయి. ఎంపీ అభ్యర్థుల ప్రకటన వెలువడిన అనంతరం ప్రచారం జోరందుకుంది. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పార్లమెంట్ నియోజకవర్గాలను కలియతిరిగారు. మండుతున్న ఎండలను సైతం లెక్కచేయకుండా ప్రధాన పార్టీల అభ్యర్థులు జోరుగా ప్రచారం సాగించారు. సంగారెడ్డి జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజక వర్గాలు మెదక్, జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో ఉన్నాయి. సంగారెడ్డి, పటాన్‌చెరు మెదక్ పార్లమెంట్ పరిధిలో ఉండగా, జహీరాబాద్, అందోలు, నారాయణఖేడ్ జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో ఉన్నాయి. దీంతో జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో ప్రధాన పార్టీల అభ్యర్థులు శనివారం వరకు జోరుగా ప్రచారం చేశారు. ప్రధాని మోదీ, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మాజీమంత్రి హరీశ్‌రావు, సీఎం రేవంత్ తదితర దిగ్గజ నేతలు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. మోదీ జహీరాబాద్ పార్లమెంట్‌లో నిర్వహించిన బహిరంగ సభలో పాల్గొని బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని ప్రచారం చేశారు. సీఎం రేవంత్ జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో నిర్వహించిన బహిరంగ సభలో, పటాన్‌చెరులో రోడ్‌షోలో పాల్గొన్నారు.

ప్రత్యేక ఆకర్షణగా కేసీఆర్ రోడ్‌షోలు

ప్రచారంలో మిగతా పార్టీల కంటే బీఆర్ఎస్ ముందంజలో ఉన్నది. ఇతర పార్టీల కంటే ముందుగానే బీఆర్ఎస్ మెదక్, జహీరాబాద్ పార్లమెంట్ స్థానాలకు వెంకట్రామిరెడ్డి, గాలి అనిల్‌కుమార్‌లను అభ్యర్థులుగా ప్రకటించింది. అభ్యర్థులను ప్రకటించిన వెంటనే మాజీమంత్రి హరీశ్‌రావు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నియోజకవర్గ, మండల, గ్రామస్థాయిలో నాయకులు, కార్యకర్తల సమావేశాలు నిర్వహించారు. ప్రచారంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేపట్టిన బస్సుయాత్ర, రోడ్‌షోలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మొదట అందోలు నియోజకవర్గంలోని సుల్తాన్‌పూర్ సమీపంలో లక్ష మందితో కేసీఆర్ భారీ బహిరంగ సభ జరిగింది. ఏ పార్టీ నిర్వహించని విధంగా కేసీఆర్ బహిరంగ సభ విజయవంతం కావటంతో పాటు ప్రజల నుంచి ఊహించని రీతిలో స్పందన లభించింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా కేసీఆర్ బస్సుయాత్ర జరిగింది. ఈనెల 8 పటాన్‌చెరులో కేసీఆర్ బస్సుయాత్ర, రోడ్‌షో నిర్వహించారు. 50వేల మందితో నిర్వహించిన రోడ్‌షో సక్సెస్ అయింది. కేసీఆర్ ప్రచారంతో బీఆర్ఎస్‌కు సంగారెడ్డి జిల్లాలో బలం పెరిగింది. ఇదిలాఉంటే బీఆర్ఎస్ అభ్యర్థులు వెంకట్రామిరెడ్డి, గాలి అనిల్‌కుమార్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో పర్యటిస్తూ ఓటర్లను ఆకట్టుకునేలా ప్రచారం చేశారు. పార్టీ ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, మాణిక్‌రావు, మహిపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు క్రాంతికిరణ్, భూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ ముమ్మర ప్రచారం చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వ హామీలు, పాలన విఫలం కావడంతో ఓటర్లు బీఆర్ఎస్ వైపు మొగ్గ చూపుతున్నారు. జహీరాబాద్, మెదక్ పార్లమెంట్‌లో బీఆర్ఎస్ విజయం ఖాయమని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు.

వ్యూహాలకు పార్టీల పదును...

పార్లమెంట్ ఎన్నికల ప్రచారం శనివారం సాయంత్రం 5 గంటలతో ముగిసింది. ఈనెల 13న ఎన్నికలు జరుగనున్నాయి. ఎన్నికలకు రెండురోజులు మాత్రమే మిగిలి ఉండటంతో ప్రధాన రాజకీయ పార్టీలు ఎన్నికల వ్యూహాలకు పదును పెడుతున్నాయి. పార్లమెంట్ ఎన్నికల్లో గెలిచి సత్తా చాటాలని బీఆర్ఎస్ బలంగా కోరుకుంటుంది. అందుకు అనుగుణంగానే కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వ వైఫల్యాలను బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లింది. బీఆర్ఎస్ గెలుపు ఆవశ్యకతను అధినేత కేసీఆర్ ఓటర్లకు వివరించారు. దీంతో సంగారెడ్డి జిల్లాలోని ఓటర్లు బీఆర్ఎస్ వైపు మొగ్గ చూపుతున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, రైతులు ఇలా అన్ని వర్గాలు బీఆర్ఎస్‌కు మద్దతు పలుకుతున్నారు. కాంగ్రెస్, బీజేపీలు గెలుపు కోసం ప్రయత్నాలు చేస్తున్నాయి. ప్రచారం ముగియడంతో అధికార యంత్రాంగం ఎన్నికల నిర్వహణపై దృష్టి పెట్టింది. సోమవారం ఎన్నికల జరుగనుండడంతో ఆదివారం పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలను, పోలింగ్ సిబ్బంది తరలించేలా ఏర్పాటు చేపట్టింది. ఎక్కడా శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా పోలీసు శాఖ బందోబస్తు ఏర్పాటు చేసింది. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వల్లూరు క్రాంతి, ఎస్పీ రూపేశ్ ఎన్నికల నిర్వహణపై దృష్టి పెట్టారు. ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్షలు నిర్వహిస్తూ సూచనలు చేస్తున్నారు.

ఆంధ్రాకి పయనం!

- ఓటేయడానికి వెళ్తున్న ఏపీ ఓటర్లు
- బస్సులు కిటకిట..
- బస్సెక్కితే బీరు, బిర్యానీ ఆఫర్ చేస్తున్న పార్టీలు
- పార్లమెంట్, ఎమ్మెల్యే ఎన్నికలు ఒకేసారి ఉండటంతో అటు మొగ్గు
- రెండు చోట్ల ఓటర్లుగా నమోదు
- రానుపోను ఖర్చులిస్తున్న అభ్యర్థులు
- ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసిన నేతలు

శుక్రవారం రాత్రి పటాన్‌చెరు నుంచి ఆంధ్రా ప్రాంతానికి వెళ్తున్న ట్రావెల్ బస్సులు

పటాన్‌చెరు, మే 11: సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు, సంగారెడ్డి తదితర నియోజకవర్గాల్లో నివసిస్తున్న ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఓటేయడానికి ఏపీ బాట పట్టారు. ఈనెల 13న తెలంగాణతో పాటు ఏపీలోనూ ఎంపీ ఎన్నికలు జరుగుతున్నాయి. దీంతో అదే రోజున ఏపీ అసెంబ్లీ ఎన్నికలు ఉండడంతో అక్కడ ఓటేయడానికి ఆసక్తి చూపి మూడు నాలుగు రోజులుగా ఏపీకి వెళ్తున్నారు. వీరి కోసం పోటాపోటీగా బస్సులు ఏర్పాటు చేస్తున్నాయి ఏపీలోని రాజకీయ పార్టీలు. అంతేకాకుండా బీరు, బిర్యానీతో జేబు ఖర్చుకు నగదు ఆఫర్ చేస్తున్నట్లు తెలిసింది. ఈసారి ఏపీ అసెంబ్లీకి హోరాహోరీ పోరు జరుగుతున్నది. ప్రతి ఓటు కీలకంగా మారింది. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌తో పాటు చుట్టుపక్కల స్థిరపడ్డ, నివసిస్తున్న ఏపీ వాసులను ఓటు వేసేందుకు రావాలని రాజకీయ పార్టీలు కోరుతున్నాయి. వారికోసం టూరిస్ట్ బస్సులు, ట్రావెల్ బస్సులు, కార్లు, ఇతర వాహనాలతో పాటు ట్రైన్ టికెట్లు సైతం బుక్ చేశారు. ట్రావెల్, టూరిస్ట్, ఆర్టీసీ బస్సుల్లో రాబోతున్న ఓటర్లకు ఆకర్షణీయమైన ప్యాకేజీలు ఇస్తున్నారని సమాచారం. ఏ పార్టీకి చెందిన నాయకులు ఆ పార్టీ ఓటర్ల కోసం బస్సులను నేరుగా ఏర్పాటు చేస్తున్నారు. ఒక బీరు.. ఒక బిర్యానీ పొట్లం, ఖర్చులకు కొంత నగదు, చల్లటి నీళ్ల బాటిల్‌ను ఇచ్చి బస్సు సీట్లలో కూర్చోబెడుతున్నారు. కుటుంబంతో పాటు వచ్చే వారికి కార్లను పంపుతున్నారు. ఇప్పుడు ఏపీలో ఓటుకు సగటున రూ. 5వేలు ఇస్తామని హామీ ఇచ్చినట్టు సమాచారం. రానుపోను ఖర్చులతో పాటు తిరిగి వెళ్లేందుకు ఏర్పాట్లు సైతం చేస్తుండటంతో చాలామంది ఓటర్లు ఈసారి ఏపీలో తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఆసక్తిగా ఉన్నారు. పైగా శనివారం, ఆదివారం సెలవులు కావడంతో ఐటీతో పాటు ఇతర ప్రైవేటు సంస్థల్లో పనిచేస్తున్న కార్పొరేట్ ఉద్యోగులకు సెలవులున్నాయి. శుక్రవారం రాత్రికే వేలాది మంది ఏపీకి బయలు దేరారు. పటాన్‌చెరు నియోజకవర్గంలో 4.13 లక్షల మంది ఓటర్లున్నారు. వీరిలో దాదాపు 25శాతం వరకు ఏపీ వాళ్లు ఉన్నారు. వీరిలో అధికశాతం మందికి తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్‌లో ఓట్లు ఉన్నాయి. ఇక్కడ స్థిరపడ్డ వారిలో చాలామందికి ఏపీ రాజకీయాలపై ఆసక్తి ఉంది. ఈసారి అక్కడ హోరాహోరీగా పోరు జరుగుతుండడంతో రెండుచోట్ల ఓట్లున్న వారు ఏపీలో ఓటేసేందుకు మొగ్గు చూపుతున్నారు. అమీన్‌పూర్‌లోనే మొత్తం 84వేలమంది ఓటర్లు ఉండగా, ఏపీ ఓటర్లు 10వేలమంది వారి రాష్ట్రానికి ప్రయాణం అయ్యారని సమాచారం. పటాన్‌చెరు, బొల్లారం, రామచంద్రాపురం, భారతీనగర్, తెల్లాపూర్ మున్సిపాలిటీల ఓటర్లు ఏపీకి ఇస్నాపూర్, ముత్తంగి, రుద్రారం, చిట్కుల్, గుమ్మడిదల, బొంతపల్లి, భానూర్, ఇంద్రేశం పరిశ్రమల్లో కార్మికులుగా పనిచేస్తున్నవారిలో అధికశాతం మంది ఏపీలో తమ ఓటును అక్కడ వేసేందుకు వెళ్తున్నారు. పరిశ్రమల్లో పనిచేసే కార్మికులతో పాటు భవన నిర్మాణ రంగంలో పని చేస్తున్న వేలాదిమంది శుక్రవారం నుంచి బయలుదేరారు.